క్లుప్తంగా

నేడు నరసరావుపేటలో వైస్ ఎంపీపీ ఎన్నిక

నరసరావుపేట రూరల్: రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఖాళీగా ఉన్న నరసరావుపేట మండల పరిషత్ ఉపాధ్యక్ష పదవికి ఈనెల 27వ తేదీ గురువారం ఉదయం 11గంటలకు ఎన్నిక నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ టీవీ కృష్ణకుమారి బుధవారం తెలిపారు. ఉదయం 11గంటలకు మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎన్నికల అధికారి ఐ.మురళీ అధ్యక్షతన ఉపాధ్యక్ష ఎన్నిక జరుగుతుందని తెలిపారు.

నవోదయకు పలువురు విద్యార్థులు ఎంపిక


అఖిరానందన్

నాదెండ్ల: జవహర్ నవోదయ మద్దిరాల క్యాంపస్‌లో ఆరో తరగతి ప్రవేశ పరీక్షలో గణపవరం విద్యార్థి సత్తా చాటి సీటు సాధించాడు. గణపవరం అంబేడ్కర్ కాలనీ ఎంపీపీఎస్ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థి కొండెపాగ అఖిరానందన్ ఇటీవల జరిగిన జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షకు హాజరయ్యాడు. ప్రకటించిన ఫలితాల్లో మంచి మార్కులు సాధించి సీటు దక్కించుకున్నాడు. విద్యార్థి తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు. పాఠశాల హెచ్ఎం ఆలోకం మారుతీరావు, ఎంఈవో ఈమని కృష్ణారెడ్డి విద్యార్థిని అభినందించారు.

రొంపిచర్లలో...

రొంపిచర్ల: స్థానిక బీసీ కాలనీలో కేరళ మోడల్ స్కూల్‌కు చెందిన ఏడుగురు విద్యార్థులు నవోదయకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ గెల్లి గాలిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్షకు సంబంధించి విడుదలైన పరీక్ష ఫలితాల్లో తమ పాఠశాలకు చెందిన బండారు శివ, దేరంగుల శ్యామ్, శ్యామల మధులత, ఓర్సు సాత్విక్, గర్నెపూడి మేరీ సాత్విక, మేడికొండ జెస్సి, కొర్నెపాటి సర్వేష్‌లు ఉత్తీర్ణులై ఎంపికయ్యారని అన్నారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ గెల్లి గాలిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామపెద్దలు, తల్లిదండ్రులు అభినందించారు. ఈ పాఠశాల నుంచి ప్రతి ఏడాది నవోదయకు విద్యార్థులకు ఉత్తమ శిక్షణ ఇచ్చి, ఎంపికకు కృషిచేస్తున్న ప్రిన్సిపాల్ గాలిరెడ్డి, ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు.

ట్రక్ ఆటో ఢీకొని మహిళకు గాయాలు

నాదెండ్ల: చిలకలూరిపేట–నరసరావుపేట రహదారిపై ఫార్‌కార్నర్స్ వద్ద టీవీఎస్ ఎక్సెల్ మోపెడ్ వాహనాన్ని ట్రక్ ఆటో ఢీకొన్న ఘటనలో మహిళ గాయాలపాలైంది. పోలీసుల కథనం ప్రకారం.. కావూరు–లింగంగుంట్ల గ్రామానికి చెందిన షేక్ సైదాబీ మంగళవారం మధ్యాహ్నం సరుకుల కొనుగోలుకు మోపెడ్‌పై చిలకలూరిపేటకు బయలు దేరింది. ఫార్‌కార్నర్స్ వద్ద వెనుక నుంచి మహీంద్రా ట్రక్ ఆటో ఢీకొంది. గాయపడిన క్షతగాత్రురాలు చిలకలూరిపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు.

పారిశుద్ధ్య నిర్వహణపై శిక్షణ వాయిదా

నాదెండ్ల: నాదెండ్ల ఘనవ్యర్థాల నిర్వహణ కేంద్రంలో మూడో రోజు బుధవారం పారిశుద్ధ్య నిర్వహణపై జరగవలసిన శిక్షణ కార్యక్రమం వాయిదా పడింది. మండల పరిషత్ కార్యాలయంలో రుణమేళా, గురువారం పలు ప్రాంతాల్లో ఉప సర్పంచ్ ఎన్నిక నేపథ్యంలో శిక్షణ వాయిదా పడినట్లు ఈవోపీఆర్డీ నిర్మలా లక్ష్మీ కుమారి తెలిపారు. గురువారం నుంచి రెండు రోజుల పాటూ యడ్లపాడు మండల అధికారులకు జరగాల్సిన శిక్షణ కూడా వాయిదా వేసినట్లు తెలిపారు.

సొలస సొసైటీలో అవగాహన సదస్సు

యడ్లపాడు: మండలంలోని సొలస గ్రామ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం(పీఏసీఎస్)లో బుధవారం ఖాతాదారులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రపంచ వ్యవసాయ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం–2025 సంవత్సరాన్ని పురస్కరించుకుని సొసైటీ ఆధ్వర్యంలో అందించే సేవలను సీఈవో చెన్నారెడ్డి వివరించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అలాగే ప్రస్తుతం సొసైటీ రికార్డులు, లావాదేవీలు పూర్తిస్థాయి కంప్యూటీకరణ చేస్తున్నట్లు వెల్లడించారు. వచ్చే ప్రారంభ నుంచి సొసైటీలో రైతులకు ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి తేనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు మూలె పిచ్చిరెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.

భవనంపై నుంచి పడి తాపీ మేస్త్రీ మృతి

నరసరావుపేట టౌన్: భవనంపై నుంచి పడి తాపీ మేస్త్రీ మృతిచెందిన సంఘటన బుధవారం పట్టణంలో చోటుచేసుకుంది. టూటౌన్ పోలీసుల కథనం ప్రకారం... ఇక్కుర్తి గ్రామానికి చెందిన భవనగిరి శ్రీనివాసరావు(48) ఎన్‌జీవో కాలనీలో నూతన ప్రైవేటు వైద్యశాల నిర్మాణ పనులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో రెండవ అంతస్తులో ఉన్న ఇనుము తొలగిస్తూ ప్రమాదవశాత్తు జారి మొదటి అంతస్తులోకి పడిపోయాడు. ఈ ఘటనలో తలకు తీవ్ర గాయమైంది. క్షతగాత్రుడిని సమీపంలోని వైద్యశాలకు తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే శ్రీనివాసరావు మృతిచెందినట్టు ధృవీకరించారు. సమాచారం అందుకున్న టూటౌన్ సీఐ హైమారావు సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. మృతునికి భార్య వెంకటరమణతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

ట్రాఫిక్ చక్రబంధంలో వినుకొండ

- నిత్యం ట్రాఫిక్ జామ్‌తో ప్రజలకష్టాలు
- నరకయాతన అనుభవిస్తున్న పట్టణవాసులు
- కూటమి హయాంలో సమస్య జటిలం


అటు–ఇటు కదలలేని స్థితిలో ట్రాఫిక్ జామ్


శివయ్యస్థూపం సెంటరులో నిలచిన భారీ వాహనాలు

వినుకొండ: పట్టణం ట్రాఫిక్ చక్రబంధంలో ఇరుక్కుపోయి ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. సుమారు 15 లక్షలు జనాభా ఉన్న వినుకొండలో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతుండటంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో నుంచి గుంటూరు–కర్నూలు జాతీయ రహదారి వెళుతుండటం, భారీ వాహనాలు రోడ్లపై తిరుగుతుండటంతో నిత్యం గంటల తరబడి కిలోమీర్లమేర ట్రాఫిక్‌జామ్ అవుతోంది. పట్టణంలోని శివయ్య స్తూపం సెంటరులో ఉదయం 9 గంటల సమయంలో స్కూల్ బస్సులు, ఆటోలు, బస్సులు గ్రామాల నుంచే వచ్చే వాహనాలతో నిముషాల వ్యవధిలో ట్రాఫిక్ జామ్ కావడం ప్రజలకు శాపంలా మారుతోంది. అలాగే సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు ఇదేతరహాలో ట్రాఫిక్ జామ్ కావటంతో నరసరావుపేట రోడ్ నుంచి మార్కాపురం రోడ్డు వాహనాలతో రద్దీగా కనిపిస్తోంది. అలాగే శివయ్య స్తూపం సెంటరు నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ట్రాఫిక్ నిలిస్తుండటంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు.

నాడు అడ్డుకున్నది వారే...

గత ప్రభుత్వం హయాంలో ట్రాఫిక్ నియంత్రించేందుకు పట్టణంలోని సురేష్ మహల్ రోడ్డు ఆక్రమణలు తొలగించాలనే ప్రయత్నాలు చేపట్టినప్పటికీ అప్పటిలో టీడీపీ నాయకులు కోర్టుల్లో కేసులు వేసి అడ్డుకోవటంతో ట్రాఫిక్ సమస్య పూర్తిగా జటిలమైంది. పట్టణంలోని కొత్తపేట, రిలయన్స్ మార్టు బజారు, ఆంధ్రాబ్యాంక్ సెంటరులో పగటిపూట విపరీతమైన ట్రాఫిక్ ప్రజలకు శాపంలా మారింది. మాజీ ఎమ్మెల్యే బొల్లాబ్రహ్మనాయుడు, చొరవతో ఎస్‌ఎస్పీ కాల్వకట్టలు నిర్మాణం, ప్రధాన సెంటరులో చందమామ రెస్టారెంట్ వద్ద ఆక్రమణకు గురైన రోడ్డు పునరుద్ధరించడం తోపాటు ట్రాఫిక్ సమస్యకు కొంతవరకు చెక్‌పెట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అదే సురేష్‌మహల్ రోడ్డు ఇరుకుగామారి మళ్లీ ట్రాఫిక్ సమస్య తలెత్తింది. అటు అధికారులు, మున్సిపల్ సిబ్బంది పట్టించుకోక పోవటంతో ప్రజల ఇబ్బందులు రెట్టింపయ్యాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

బైపాస్‌రోడ్డుతోనే ట్రాఫిక్‌కు చెక్

వినుకొండ ట్రాఫిక్ ఇబ్బందులు కు చెక్‌పెట్టాలంటే బైపాస్‌రోడ్డు మాత్రమే ప్రధానంగా కన్పిస్తోంది.గతంలో మున్సిపల్ మాస్టర్‌ప్లాన్ ఆధారంగా మార్కాపురం రోడ్డునుంచి చాట్రగడ్డపాడు, మార్కెట్‌యార్డ్ వెనుగుండా కనమర్లపూడి గ్రామం వద్ద గుంటూరు–కర్నూలు జాతీయ రహదారి నికలుపుతూ బైపాస్‌రోడ్డు డిజైన్ చేశారు. అయితే కార్యరూపం దాల్చలేదు.ఇప్పటికైయినా అధికారులు ప్రజాప్రతినిధులు బైపాస్‌రోడ్డు నిర్మాణంపై దృష్టిసారించాలి.

చాలా ఇబ్బందిగా ఉంది



వినుకొండలో ట్రాఫిక్ సమ స్య తీవ్రరూపం దాల్చింది. పెరుగుతున్న జనాభా,వా హనాలు రద్దీతో నిత్యం ట్రాఫిక్ జామ్‌అవుతుండటంతో చాలా ఇబ్బందిగా ఉంది. ఉదయం పాఠశాలలకు వెళ్లే బస్సులు, ఇతర వాహనాలతో ప్రధానసెంటరు అయిన శివయ్య స్తూపం సెంటరులోనే ట్రాఫిక్ జామ్‌అవుతోంది. ఒకవైపు రైల్వేస్టేషను రోడ్డు రంగనాయక స్వామి దేవాలయం, ఆర్టీసీ బస్టాండ్ వెళ్లే మార్గాల్లో ఇదే సమస్య. అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి.

–పాలపాటి రమణారావు, స్థానికుడు, వినుకొండ

పరిష్కారానికి కృషి చేస్తా



పట్టణంలో ట్రాఫిక్ సమస్య పెరిగిన మాట వాస్తవమే. కేవలం ఉదయం రెండుగంటలు, సాయంత్రం రెండు గంటలు ట్రాఫిక్ జామ్ అవుతోంది. పోలీస్, స్వచ్ఛంద సేవా సంస్థలు, వ్యాపారులతో సమావేశం ఏర్పాటు చేసి వారిసూచనలు సలహాలు మేరకు సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తాం. ప్రజలు కూడా సహకరించి సమస్య పరిష్కారం కోసం సహకరించాలి.

–సుభాష్ చంద్రబోస్, మున్సిపల్ కమిషనరు

గత ప్రభుత్వంలోనే నయం!



గత ప్రభుత్వం హయాంలో వినుకొండలో ట్రాఫిక్ సమస్యను చాలావరకు పరిష్కరించాం. అప్పటి ఎమ్మెల్యే బొల్లాబ్రహ్మనాయుడు,కారంపూడి రోడ్డునుంచి జాతీయ రహదారిని కలుపుతూ 60 అడుగుల రోడ్డు నిర్మించారు. అయితే మళ్లీ కూటమిప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆరోడ్డు పట్టించుకోకుండా ఆ మార్గాన్ని పూర్తిగా మూసివేశారు. ప్రజలు ఎన్ని కష్టాలు పడుతున్నప్పటికీ పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికై నా బైపాస్ నిర్మాణం జరిగితే తప్ప ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభించదు

–బేతంగా బ్రియేలు, మున్సిపల్ వైస్‌ఛైర్మన్, వినుకొండ

ఇక నుంచి వాటర్‌బెల్.. మూడుసార్లు!

నూజెండ్ల: వేసవి ఉష్ణోగ్రతలు పెరగటం వలన పాఠశాలల్లోని విద్యార్థులకు రోజుకు మూడు సార్లు వాటర్ బెల్ పాటించాలని ఎంఈవో రవిచంద్ర బుధవారం తెలిపారు. ఎంఈవో మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు ఉదయం 10, 11, 12 గంటలలకు అన్ని పాఠశాలలో విధిగా వాటల్‌బెల్ సమయాలు పాటించాలన్నారు. తాగునీరు అందుబాటులో ఉండేలా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బాధ్యత వహించాలన్నారు. తాజాగా విడుదల అయిన నవోదయ పరీక్షా ఫలితాల్లో మండలంలో ముగ్గురు ఎంపికైనట్లు తెలిపారు.

రుణమేళాకు 60 మంది హాజరు

నాదెండ్ల: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం 2024–25 ఏడాదికి గాను బీసీ, ఈబీసీ, కాపు, జనరిక్ ఫార్మసీ రుణ అర్హత మేళా నిర్వహించారు. ఆన్‌లైన్‌లో 130 మంది దరఖాస్తు చేసుకోగా, 60 మంది మాత్రమే ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. వీరికి రూ.1 లక్ష నుంచి రూ.5 లక్షల వరకూ ఎంచుకున్న యూనిట్లకు రుణ సదుపాయం కల్పించనున్నారు. సెలక్షన్ కమిటీ సభ్యులుగా ఎంపీడీవో స్వరూపరాణి, ఈవోపీఆర్డీ నిర్మలా లక్ష్మీ కుమారి, కనపర్రు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్, నాదెండ్ల బ్యాంక్ ఆఫ్ బరోడా, గణపవరం ఎస్‌బీఐ, సాతులూరు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్, బ్యాంక్ ప్రతినిధులు హాజరయ్యారు.

నవోదయ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

వినుకొండ: పట్టణంలో సీతయ్యనగర్ విజేత కాన్సెప్ట్ స్కూల్ ఆవరణలో నిర్వహించిన విద్యార్థుల సక్సెస్ మీట్ సభ నిర్వహించారు. డైరెక్టర్ కావూరి సాయికుమార్, ఆవుల మంద. బ్రహ్మయ్య, మాట్లాడుతూ ఈ నెల 25న విడుదల చేసిన నవోదయ ప్రవేశ ఫలితాలలో వినుకొండ బ్లాక్ నుండి 6 సీట్లతో ఆరో తరగతి నందు కే. యోగి బ్రహ్మ అశ్రుత్, ఆర్. పావ్యశ్రీ బిందు, కె. దుష్యంత్, బి. గౌతమ్, అదేవిధంగా ఎనిమిదో తరగతి ప్రవేశము నందు సిహెచ్ వేదిక్, సిహెచ్. యశ్వంత్, విజయ్ కేతనం ఎగరవేయడం ఆనందంగా ఉందన్నారు.

ఉపాధ్యాయుల అంకితభావమే విద్యార్థుల అభ్యున్నతి


విద్యార్థికి బహుమతులిచ్చి అభినందిస్తున్న ఎంఈవో నాగరత్నం

యడ్లపాడు: ఉపాధ్యాయులు అంకిత భావంతో తమ వృత్తిని కొనసాగిస్తే విద్యార్థులు అన్ని పోటీల్లో రాణిస్తూ ఉన్నత శిఖరాలను చేరుకుంటారని ఎంఈవో –1 ఎంవీ నాగరత్నం చెప్పారు. బుధవారం స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో మైదవోలు గ్రామంలోని మండల పరిషత్ బీసీ ప్రాథమిక పాఠశాల విద్యార్థి దావల ప్రదీప్‌ను అభినందించారు. జవహర్ నవోదయ విద్యాలయం ఆరో తరగతి ప్రవేశ పరీక్షా పోటీల్లో మంచి మెరిట్‌తో పాటు మద్దిరాల జేఎన్‌వీలో సీటు సాధించినందుకు ఎంఈవో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు క్యాలీగ్రఫీ, హిందీ అక్షరమాల, గుణింతాలు, యోగా, ధ్యానం, సంస్కృత శ్లోకాల పరిచయం, పెయింటింగ్ వంటి విభాగాల్లో ప్రత్యేక శ్రద్ధతో శిక్షణ ఇవ్వడంపై ఉపాధ్యాయులను ప్రశంసించారు. రానున్న ఏడాది జేఎన్‌వీ ప్రవేశాలకు ఎక్కువ మంది విద్యార్థులకు తర్ఫీదు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎస్ ఉమామహేశ్వరీ, టీచర్లు జీవీ హేమలత, షేక్ షహనాజ్, జి సతీష్‌కుమార్ ఉన్నారు.

కారుమంచి సొసైటీలో డిజిటలైజేషన్ సేవలు


మాట్లాడుతున్న సురేంద్రబాబు

శావల్యాపురం: మండలంలోని కారుమంచి గ్రామం ప్రాథమిక వ్యవసాయ సహకార పరమితి సంఘం పరిధిలో ఉన్న రికార్డులన్నీ డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి అయినట్లు కారుమంచి సొసైటీ ఛైర్‌పర్సన్ నర్రా సురేంద్ర బాబు అన్నారు. బుధవారం సొసైటీ కార్యాలయంలో సంఘ సభ్యులకు కంప్యూటరీకరణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సొసైటీ పరిధిలో 3360 మంది రైతులు ఉండగా అందులో 2117 మంది అప్పు పొందినట్లు తెలిపారు. సొసైటీ పరిధిలో ఇక నుంచి డిజటల్ లావాదేవీలు కొనసాగుతాయని సంఘ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి రూ. 60 కోట్లు లావాదేవీలు జరిగినట్లు తెలిపారు. 73 స్వయం సంఘాల్లోని మహిళా సభ్యులకు రూ.9 కోట్ల 10 లక్షలు రుణాలు అందజేశామన్నారు. సొసైటీ వారి సౌజన్యంతో ఇటీవల ప్రారంభించిన పెట్రోలు బంకు రోజుకు 1500 లీటర్ల డీజిల్, 1000 లీటర్ల పెట్రోలు అమ్మకాలు జరుగుతున్నాయన్నారు. పెట్రోల బంకు ఆదాయం నెలకు నికర ఆదాయం సొసైటీకి రూ.లక్ష రూపాయలు వస్తుందన్నారు. ఆయనతో పాటు సీఈవో యేరవ వెంకట నారాయణ, రైతులు పాల్గొన్నారు.

కార్మికులపై అధికారుల వేధింపులు ఆపాలి

- వారికి కనీస వేతనం వెంటనే చెల్లించాలి
- కరపత్రం ఆవిష్కరించిన నాయకులు, కార్మికులు


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కార్మికులు

నరసరావుపేట: మున్సిపల్ కార్మికులపై శానిటరీ ఇనస్పెక్టర్లు చేస్తున్న మానసిక, ఆర్థిక వేధింపులను అరికట్టాలని ప్రగతిశీల కార్మిక సమాఖ్య జిల్లా కమిటీ సభ్యులు కంబల ఏడుకొండలు అన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో పారిశుద్ధ్య కార్మికుల సమాన పనికి సమానం ఇవ్వకుండా వారిని వేధింపులకు గురిచేస్తున్న నేపథ్యంలో ప్రగతిశీల కార్మిక సమాఖ్య ఉమ్మడి గుంటూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ కరపత్రాన్ని మున్సిపల్ కార్మికులు చేస్తున్న పోరాట దీక్షా శిబిరంలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరిస్తామని ఈ మధ్యకాలంలో మంత్రి లోకేష్ కార్మికుల అందరితో సంభాషించడం జరిగిందన్నారు. కానీ అప్పటినుండే కార్మికులపై మానసిక, ఆర్థిక వేధింపులు పెరిగాయన్నారు. కార్మికుల సమస్యను సకాలంలో పరిష్కరించాల్సినటువంటి స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, మున్సిపల్ కమిషనర్ ఇద్దరు మొండిగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదన్నారు. కుల నిర్మూలనా పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ, దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం సీనియర్ నాయకులు నల్లపాటి రామారావు, బీసీ సంక్షేమ సంఘం నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు, మాల మహానాడు ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు బోరుగడ్డ అంబేడ్కర్ పాల్గొన్నారు.

పది పరీక్షలు ప్రశాంతం

నరసరావుపేట ఈస్ట్: పల్నాడుజిల్లా పరిధిలో పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. జిల్లాలోని 128 పరీక్షా కేంద్రాలలో బుధవారం నిర్వహించిన ఫిజికల్ సైన్స్ పరీక్షకు 25,488 మంది రెగ్యులర్ విద్యార్థులకు గాను 25,237 మంది హాజరయ్యారు. అలాగే 27 కేంద్రాలలో పదవ తరగతి దూరవిద్య సైన్స్ అండ్ టెక్నాలజీ పరీక్షకు 1,150 మంది విద్యార్థులకు గాను 958 మంది హాజరయ్యారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ చిలకలూరిపేట మండల పరిధిలోని 3 కేంద్రాలు, జిల్లా పరిశీలకులు ఎస్.గీత పెదకూరపాడులోని 2 కేంద్రాలు, రాష్ట్ర కోఆర్డినేటర్ కె.సుధాకర్ సత్తెనపల్లిలోని 3 పరీక్షా కేంద్రాలను సందర్శించారు. జిల్లా పరిధిలో ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని డీఈఓ తెలిపారు.

ఉగాది సంబరాల కరపత్రం ఆవిష్కరణ

నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెంలోని శ్రీ వాసవి ఆర్యవైశ్య అన్నదాన సత్రంలో ఈనెల 30వ తేదీన ఉగాది సంబరాలను నిర్వహిస్తున్నట్టు సత్రం కన్వీనర్ బత్తుల మురళీ తెలిపారు. సంబరాల కరపత్రాన్ని బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మురళీ మాట్లాడుతూ మహాశివరాత్రి సందర్భంగా కోటప్పకొండకు వచ్చిన ప్రభల నిర్వాహకులు, ఇస్సప్పాలెం తిరునాళ్లకు వచ్చిన ప్రభల నిర్వాహకులకు ఈ సంబరాలలో సన్మానం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, జనసేనపార్టీ నాయకులు గాదే వెంకటేశ్వరరావు, కోటప్పకొండ ఈవో చంద్రశేఖర్, ఇస్సప్పాలెం ఈవో మాధవీలతలు పాల్గొంటారని వివరించారు. కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో చేగు వెంకటేశ్వరరావు, రావిక్రింది వెంకటసుబ్బారావు, వెల్లంపల్లి కేశవరావు, కేఎంఎల్ ప్రసాద్, ఏవీఆర్‌కే సత్యనారాయణ, తాడువాయి శ్రీనివాసరావు, బొగ్గారపు బ్రహ్మానందం, జల్లి శ్రీనివాసరావు, కోట వాణి, దేవిశెట్టి సుధారాణిలు పాల్గొన్నారు.

ములకలూరి వాసికి నేషనల్ పీస్ అవార్డు



నూజెండ్ల: నూజెండ్ల మండలం ములకలూరు గ్రామానికి చెందిన కవి రచయిత గాయకుడు జీవజ్యోతి ఫౌండేషన్ వ్యవస్థాపకులు మందా వెంకట్రావుకు నేషనల్ పీస్ కౌన్సిల్ అవార్డు దక్కింది. ఈనెల 23న పుణెలో జరిగిన కార్యక్రమంలో తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ తమ్ముడు దుర్గా స్టాలిన్, తదితర ప్రముఖులు చేతుల మీదగా ఈఅవార్డు అందుకున్నారు. దేశ వ్యాప్తంగా 30 మంది ఎంపిక కాగా ఆంధ్రప్రదేశ్ తరుపున అరుదైన అవార్డు దక్కిందని అవార్డు గ్రహీత మందా వెంకట్రావు బుధవారం తెలిపారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వెంకటరావు దళిత ఉద్యమాలో పాల్గొంటు గుర్తింపు తెచ్చుకున్నారు. రాజకీయాల్లో చురుకగా పాల్గొంటూ వినుకొండ శాసన సభ ఎన్నికల్లో రెండు సార్లు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గుర్తింపు తెచ్చుకున్నారు. తన గళం ద్వారా బలహీన వర్గాలలో చైతన్యం నింపే వెంకటరావుకు ఈఅవార్డు దక్కటం అభినందనీయమని గ్రామస్తులు కొనియాడారు.

విప్పర్లపల్లిలో ఇమ్యూనైజేషన్ అధికారిణి పర్యటన



రొంపిచర్ల: మండలంలో విప్పర్లపల్లి గ్రామంలో బుధవారం జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిణి డాక్టర్ గీతాంజలి పర్యటించారు. ఆ గ్రామంలో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాలు, ఇంటింటా వైద్యం కార్యక్రమమును తనిఖీ చేశారు. సామాజిక ఆరోగ్య అధికార్లు వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సాయిబాబు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ సిబ్బంది, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైవింగ్ శిక్షణ ప్రారంభం

నరసరావుపేట: స్థానిక ఏపీఎస్ఆర్టీసీ డిపోలో బుధవారం హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ స్కూల్ 19వ బ్యాచ్ శిక్షణా తరగతులను డిపో మేనేజర్, డ్రైవింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా శిక్షణ కొరకు జాయిన్ అయిన డ్రైవర్లను ఉద్దేశించి మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవింగ్ స్కూలులో శిక్షణ తీసుకొని హెవీ లైసెన్స్ పొందిన వారికి భవిష్యత్తులో మంచి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో సైకిళ్ల పంపిణీ



నరసరావుపేట ఈస్ట్: సమాజానికి రోటరీ క్లబ్ అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. రావిపాడురోడ్డులోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో బుధవారం సాయంత్రం రోటరీ క్లబ్ ఆఫ్ నరసరావుపేట ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 100 మంది పాఠశాల స్థాయి విద్యార్థినిలకు సైకిళ్లు పంపిణీ చేశారు. పట్టణంలోని డాక్టర్ రామలింగారెడ్డి మ్యాక్సీవిజన్ ఐ హాస్పిటల్స్ చేపట్టిన సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా సి.ఎస్.ఆర్ ఫండ్స్‌తో సైకిళ్లు అందచేశారు. క్లబ్ అధ్యక్షుడు కపలవాయి రాజేంద్రప్రసాద్ ఆధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో క్లబ్ పీడీజీ డాక్టర్ చిలుకూరి శరత్‌బాబు, డాక్టర్ ఏ.ఏ.వి.రామలింగారెడ్డి, ప్రాజెక్ట్ ఛైర్మన్ మామిడి సుబ్బారావు పాల్గొన్నారు.

సక్రమంగా ఎన్నికలు జరిగేందుకు సహకరించాలి

- ఎస్పీ, అదనపు ఎస్పీలను కలిసి వినతిపత్రం సమర్పించిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు, వార్డు మెంబర్లకు రక్షణ కల్పించండి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: నియోజకవర్గంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగేందుకు వైఎస్సార్‌సీపీ వారికి రక్షణ ఇచ్చి పోలీసులు నిష్పాక్షికంగా వ్యవహరించాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ, అదనపు ఎస్పీలను కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గురువారం నియోజకవర్గంలో నరసరావుపేట మండల పరిషత్ ఉపాధ్యక్ష పదవికి, రొంపిచర్ల మండలంలోని అలవాల, తురుమెళ్ళ, కొత్తపల్లి గ్రామ పంచాయతీల ఉపసర్పంచ్ పదవులకు ఎన్నికలు జరగనున్నాయన్నారు. అధికార టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ వారిని ఎన్నికల ప్రక్రియకు హాజరుకాకుండా చేసేందుకు బెదిరింపులతో పాటు అన్నిరకాల చర్యలకు పాల్పడుతున్నారన్నారు. అందువల్ల ఎన్నికలకు హాజరయ్యే వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు, వార్డు మెంబర్లకు రక్షణ కల్పించాలని కోరామన్నారు. సీసీ కెమెరాలు, అదనపు బలగాలు ఏర్పాటు చేయాలని కోరామన్నారు. కూటమి ప్రభుత్వంలో తుని, పిడుగురాళ్లలో ఏం జరిగిందో ప్రజలు తెలుసునన్నారు. అలాంటి సంఘటనలు పునరావృతంగాకుండా చేయాలని ఎస్పీని కోరామన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు పదముత్తం చిట్టిబాబు, రైతు విభాగ జిల్లా అధ్యక్షులు అన్నెంపున్నారెడ్డి, రొంపిచర్ల మండల నాయకులు పడాల చక్రారెడ్డి, పచ్చవ రవీంద్రబాబు, కురుగుంట్ల శ్రీనివాసరెడ్డి, వెంకటప్పారెడ్డి పాల్గొన్నారు.

ఫిర్యాదులొస్తే బాధ్యులపై చర్యలు

ఎమ్మెల్యే ప్రత్తిపాటి హెచ్చరిక


తూబాడులో రోడ్డు పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, స్థానిక నాయకులు

నాదెండ్ల: గ్రామాల్లో రోడ్లు, డ్రెయినేజీ పనులు పూర్తయ్యాక ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే పనులు నిర్వహించిన బాధ్యులపై చర్యలు తప్పవని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు హెచ్చరించారు. తూబాడు గ్రామంలో రూ.21 లక్షల వ్యయంతో నిర్మించే సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణ పనులను స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. పనులు నిర్వహిస్తున్న కాంట్రాక్టర్‌కు, అధికారులకు సూచనలు చేశారు. అభివృద్ధి పనులకు సంబంధించిన నిధుల విడుదల విషయమై కూటమి ప్రభుత్వంలో ఎలాంటి సమస్యలు తలెత్తవన్నారు. పనులను నాణ్యతా లోపాలు లేకుండా పూర్తి చేయాలన్నారు. త్వరలో నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట జనసేన ఇన్‌చార్జి తోట రాజారమేష్, టీడీపీ నాయకులు నెల్లూరి సదాశివరావు, మండల అధ్యక్షుడు బండారుపల్లి సత్యనారాయణ, జవ్వాజి మదన్, తూబాటి కిషోర్, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

ఎత్తి పోతల పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

చిలకలూరిపేట: ఎత్తిపోతల పథకాన్ని ఉపయోగించుకొని నీటి సమస్యను పరిష్కరించుకోవాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. మండలంలోని లింగంగుంట్ల గ్రామంలో ఉన్న మంచినీటి చెరువును, కుప్పగంజి వాగుపై ఉన్న ఎత్తి పోతల పథకాన్ని బుధవారం పరిశీలించారు. లిఫ్ట్ మరమత్తు పనులు చేయించిన నీటి సంఘం అధ్యక్షుడు బైరా సంజీవరావును ఆయనకు సహకరించిన వారికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూ ఎస్ అధికారులు పాల్గొన్నారు.

లౌకికతత్వానికి భిన్నమైన ఆలోచనలు సరైనవి కావు


మాట్లాడుతున్న సీహెచ్ సుబ్బారావు

చిలకలూరిపేట: ప్రజాస్వామ్యం, లౌకిక తత్వానికి భిన్నమైన ఆలోచనలు సమాజాన్ని విచ్ఛిన్నం చేస్తాయని భారత రాజ్యాంగ పరిరక్షణ సమితి అధ్యక్షుడు సీహెచ్ సుబ్బారావు చెప్పారు. మండలంలోని మురికిపూడి గ్రామంలో సమితి సభ్యుల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం రాజకీయ పార్టీల్లో కూడా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సామాజిక వర్గాల జనాభా నిష్పత్తి ప్రకారం గుర్తింపు ఇవ్వాలని కోరారు. న్యాయ వ్యవస్థలో అన్ని సామాజిక వర్గాలకు ప్రాతినిథ్యం కల్పించాలన్నారు. విద్యా, ఉద్యోగాలకు దూరంగా ఉన్న కుటుంబాల్లోని వారు చదువు విలువ గుర్తించి తమ పిల్లలను పాఠశాలకు పంపి విద్యనభ్యసించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సమితి నాయకులు పి.అబ్రహం, కె.అంజలి, బి.సోమయ్య, ఎస్.మస్తాన్ పాల్గొన్నారు.